క్లుప్తంగా

ఘనంగా మెరుపుల పైడితల్లి అమ్మవారి పండగ



అమ్మవారి సన్నిధిలో ఆదారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం: మెరుపుల పైడితల్లి అమ్మవారి పండగను మంగళవారం కనులపండువగా జరిపించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆదారి ఆనంద్‌కుమార్ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో లలితా పారా యణం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బూస అప్పలరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, నాయకులు దాడి సత్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, మళ్ల ధనలత, చట్టి నూకరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



అప్పలనర్సమ్మ కుటుంబానికి సరకులు, టేబుల్ ఫ్యాన్ అందిస్తున్న పద్మావతి

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త మేడపురెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. తొలుత కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బాలిశెట్టి అప్పలనర్సమ్మ కుటుంబానికి రూ.5వేల నగదు, 25 కిలోలబియ్యం, టేబుల్ ఫ్యాన్ అందించారు. 30 మందికి 5 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేశారు. స్థానిక మహిళలు భాను, జ్యోతి, స్వాతి, రాణి, ఎస్‌కే బేగం, పద్మావతి, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు అందిస్తున్న వైద్యుడు వికాశ్

గోపాలపట్నం: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చంద్రనగర్, బుచ్చిరాజుపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ కె. వికాశ్ విద్యార్థులకు మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి పరిధిలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీల్లో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఇ. సాంబమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

➡ బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ దీపిక పర్యవేక్షణలో పిల్లలకు సిబ్బంది నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

కల్యాణం .. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టంపజేసి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.

అంతా మా ఇష్టం

- రహదారులు ఆక్రమించి వేస్తున్న భవన నిర్మాణ వ్యర్థాలు
- జనం ఇబ్బందులు పట్టించుకోని నిర్మాణదారులు
- అధికారులదీ అదే తీరు ..



గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో ఇలా..

కంచరపాలెం : నలుగురు వినియోగించే రహదారుల్లో భవన నిర్మాణ సామగ్రి డంప్‌చేస్తున్నారు. కనీసం ప్రజల ఇబ్బందులను కూడా పట్టించుకోకుండా నిర్మాణదారులు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జీవీఎంసీ 47,48, 54,56,57 వార్డు పరిధిలో కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ , 104 ఏరియా, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, మర్రిపాలెం పలు ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచరపాలెం మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, మల్లసూరివీధి, శ్యామ్‌నగర్, సుభాష్‌నగర్, గౌరీనగర్, రెడ్డికంచరపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కప్పరాడ, ఇందిరానగర్, బర్మాక్యాంప్, జైభారత్‌నగర్, అరుంధతినగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు భవనాలు నిర్మిస్తున్నారు. వీధుల్లో భవన నిర్మాణాలకు అవసరసమైన ఇసుక, పిక్క, ఇటుక వంటి సామాగ్రిని తీసుకువచ్చి రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. అంతేగాక వాటికి సంబంధించిన పనులు కూడా అక్కడే చేపట్టడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

పలు కాలనీల్లో పిక్క, ఇసుక వంటి వాటిని రోడ్డుమీద ఉన్న బోర్లు, కుళాయిల వద్ద వేస్తుండడంతో స్థానికులు తాగునీటిని పట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు చీకటి పడిన తరువాత ఇక్కడ సమీపంలో ఉన్న గెడ్డల్లో డెబ్రిస్‌లను పారబోస్తున్నారు. రోడ్డుమీద గుట్టలుగా పారబోస్తున్న డెబ్రిస్ ను తొలగిలించక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసంచార ప్రాంతాలు కావడంతో నిత్యం ఇటుగా వెళ్లే వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిలో నిర్మాణ సామగ్రిపై ద్విచక్ర వాహదారులు జారీ పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నడవాలంటే ఇబ్బందులు



రహదారుల్లో ఇంటి నిర్మాణ సామగ్రి అడ్డదిడ్డంగా వేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జోనల్ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తాం.

– చెంగల ఈశ్వరరావు, ఐటీఐ కూడలి

చర్యలు తీసుకుంటాం



రహదారుల్లో వ్యర్థాలు, నిర్మాణ సామగ్రి వేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. జోన్ పరిధిలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. ఆయా వార్డుల్లో పర్యటించి నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సచివాలయాల టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులకు, టీపీవో అధికారులకు ఆదేశాలు జారీ చేశా.

– ఐవీ రమణమూర్తి, ఏసీపీ జోన్ 5, జ్ఞానాపురం

ప్రేమ పేరుతో అమ్మాయిలకు వల

- విశాఖ వాసికి రిమాండ్



నిందితుడు చంద్రమౌళి

పుట్టపర్తి: ప్రేమ పేరుతో అమ్మాయిలకు గాలం వేసి, వారి ఫొటోలు, వీడియోలు తీసి మార్ఫింగ్ చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న విశాఖపట్నానికి చెందిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుక్కపట్నం ఎస్‌ఐ నరసింహుడు మంగళవారం వెల్లడించారు. పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ యశ్వంత్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశాఖపట్నం ప్రాంతానికి చెందిన చంద్రమౌళిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాను చేసిన నేరాలను నిందితుడు అంగీకరించాడు. చంద్రమౌళికి ఇదివరకే వివాహమైంది. కళాశాల విద్యార్థినులు పలువురిని ప్రేమ పేరుతో నమ్మించి, వారికి తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అసభ్యకరమైన చిత్రాలతో మార్ఫింగ్ చేసేవాడు. అనంతరం వాటిని విద్యార్థినులకు చూపి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. కొన్నేళ్లుగా హైదరాబాద్, వైజాగ్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ఈ తరహా మోసాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో నిందితుడి ఉచ్చులో చిక్కుకున్న పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి అసలు బాగోతం వెలుగు చూసింది. విచారణ అనంతరం మంగళవారం నిందితుడిని అరెస్ట్ చూసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బీజేపీ పాలనలో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 761వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, ప్లాంట్ డిజైన్, వీఎస్‌జీహెచ్ తదితర విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదేలేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

పెదగంట్యాడ వీహెచ్‌సీ వైద్యాధికారికి గాయాలు



గెడ్డలోకి దూసుకెళ్లిన కారు, పక్కన డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: మండలంలోని వినాయనగర్ వుడా కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి గెడ్డలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్ వుడా కాలనీలో గల సీడబ్ల్యూసీలో మంగళవారం నిర్వహించనున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వైద్యాధికారి రమేష్‌బాబు వచ్చారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు ఆయన గెడ్డ పక్కన పార్కింగ్ చేసిన కారును తీస్తుండగా ఒక్కసారిగా కారు ముందుకు వెళ్లిపోయింది. దానిని కంట్రోల్ చేసేలోగా గెడ్డలోకి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. గెడ్డలో ఉన్న కారును జీవీఎంసీ అధికారులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని న్యూపోర్టు సీఐ రాము తెలిపారు.

1 నుంచి విద్యార్థులకు రాగిజావ

పెదగంట్యాడ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వచ్చే నెల ఒకటి నుంచి విద్యార్థులకు రాగిజావను అందజేయాలని ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ జిల్లా సమన్వయకర్త జయశాస్త్రి ఆదేశించారు. మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాల, సిద్దేశ్వరంలోని ఎంపీపీ పాఠశాలలను యూనిట్ బృందం మంగళవారం సందర్శించింది. ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని బృంద సభ్యులు పరిశీలించారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. నాణ్యతపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలకు అందజేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పోషక విలువలున్న ఆహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నామని చెప్పారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో 90 శాతం మంది మధ్యాహ్న భోజనం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సహాయ సమన్వయకర్త సత్యనారాయణ, సీఆర్పీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్ అందజేస్తున్న జీఎం అశోక్

ఉక్కునగరం: విభిన్న ప్రతిభావంతులకు స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ ముగియడంతో, మంగళవారం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) కార్యక్రమంలో భాగంగా జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 100 మంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలరింగ్ తో పాటు అగరబత్తి, కొవ్వొత్తులు, ఫినాయిల్, సబ్బుల తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. టైలరింగ్ శిక్షణ మూడు నెలలు కాగా, మిగిలిన అంశాల్లో రెండు నెలలు శిక్షణ ఇచ్చారు. సుజాత నగర్‌లోని శ్రేయ ఫౌండేషన్, పెదవాల్తేరులోని సన్‌ఫ్లవర్ స్పెషల్ స్కూల్, ఎంవీపీ కాలనీలోని లెబెన్ హిల్ఫేల్లో ఈ శిక్షణ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లోని టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఎస్సార్ విభాగం జీఎం ఎ.అశోక్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్సార్ అధికారులు పలువురు పాల్గొన్నారు.

నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సందర్శన



అవార్డు గ్యాలరీలో స్టీల్‌ప్లాంట్ అధికారులతో ఎన్‌డీసీ బృందం

ఉక్కునగరం: నేషనల్ డిఫెన్స్ కాలేజీ(ఎన్‌డీసీ) బృందం మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. పర్యటనలో భాగంగా బృందంలోని 17 మంది సభ్యులు ఉదయం ప్లాంట్‌కు చేరుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ(వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌ను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తుల రవాణా గురించి పీపీ విభాగం జీఎం డాక్టర్ రమాదేవి వారికి వివరించారు. అనంతరం అవార్డు గ్యాలరీని సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను పరిశీలించారు. తర్వాత టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ)కు వెళ్లి.. శిక్షణ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, వర్క్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌లో ఏయూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శిరీన్ రెహమాన్

ఏయూక్యాంపస్: ఆంధ్రా యూనివర్సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రోబోటిక్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల పుణేలోని శ్రీ శివ ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన ఎఫ్‌టీసీ రోబోటిక్స్ స్టెమ్ టెక్నాలజీ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 60 జాతీయ, 11 అంతర్జాతీయ జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఏయూ విద్యార్థుల బృందం పుణే, చెన్నై, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాల జట్లతో ఇజ్రాయిల్, రొమేనియా వంటి అంతర్జాతీయ జట్లతో పోటీపడ్డారు. 71 జట్లలో ఏయూ జట్టు 28వ స్థానంలో నిలిచింది. ఏయూ జట్టుకు స్టెమ్ యంగ్ అచీవర్ అవార్డు లభించింది. ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను ఎన్ఆర్ఐలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రహమాన్, శిరీన్ రహమాన్ దంపతుల కుమారుడు సమీర్ షేక్, సంతోష్ అందించారు ఈ ఘనత సాధించిన విద్యార్థులను చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ అభినందించారు.

ఘనంగా దుర్గాదేవి పండగ



దుర్గాదేవిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురం సమీపంలోని నేవల్ ఆర్మమెంట్ డిపోలో (ఎన్ఏడీ) దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పసుపు కుంకుమలతో పూజలు చేశారు. సాయంత్రం గ్రామంలో ఘటాలను ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పరసతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం కుర్రకారును ఉర్రూతలూగించింది.

దుర్గా దేవిని దర్శించుకున్న నాయకులు

అమ్మవారిని పలువురు నాయకులు దర్శించుకున్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, టీడీపీ నాయకులు పెంటకోట అజయ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

40, 62 వార్డుల్లో సంబరాలు



40వ వార్డులో ర్యాలీ చేపడుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, అభిమానులు



62వ వార్డు కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న నాయకులు

సింథియా: జీవీఎంసీ పాలకవర్గం కొలువుదీరి రెండేళ్లు కావడంతో మంగళవారం జీవీఎంసీ40, 62వ వార్డుల్లో సంబరాలు చేశారు. ర్యాలీలు నిర్వహించారు.

ఆయా వార్డుల కార్పొరేటర్లను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ నాయకత్వంలో వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానన్నారు. రోడ్లు, తాగునీరు అందించడానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ప్రధాన గెడ్డ, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, విద్యుత్ దీపాలు, తాగునీరు వంటి సదుపాయాల కల్పనకు కషి చేస్తానన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి చైత్రపూర్ణిమకు ఏర్పాట్లు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దేవాల రాజు కమిటీ సభ్యులు

కంచరపాలెం: చైత్రపూర్ణిమి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీ నుంచి సుబ్రహ్మణ్యస్వామి చైత్ర శుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు దేవాల రాజు కృష్ణ తెలిపారు. కంచరపాలెం ఊర్వశికూడలి రవీంద్రనగర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం వేడుకల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ, మండపారాధన, ముత్తైదువుల చేతులమీదుగా ఊంజల సేవ ఉంటుందన్నారు. అనంతరం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం స్వామి తిరువీధి మహోత్సవం ఉంటుందన్నారు. ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరణ ఏర్పాటు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాండ్రేగుల రాము, సీహెచ్.కుమారి, కె.రవి, సీహెచ్ సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



జింక్ క్రీడామైదానానికి వెళ్లే మార్గంలో యు మలుపు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు జింక్ క్రీడా మైదానానికి వెళ్లే మార్గంలో ఉన్న 'యు' ఆకార మలుపు వాహనదారులను బెంబేలెత్తిస్తోంది. సింగల్ రోడ్డు ఉండడం తో ఇక్కడ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్ తదితర ప్రాంత వాసులు,అలాగే మింది, బీహెచ్‌పీవీ,అక్కిరెడ్డిపాలెం తదితర ప్రాంత వాసులు ఈ మార్గం మీద రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇక్కడ యు మలుపు వద్ద ఎదుట వాహనాన్ని గుర్తించ లేని విధంగా ఉంది. దీంతో ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అలాగే జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న యు మలుపు వద్ద, గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఏకశిల ఎదురుగా సర్వీసు రోడ్డుని యూ ఆకార మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

ఆ మలుపుల వద్ద ఎదుట వాహనాన్ని గుర్తించే విధంగా ట్రాఫిక్ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రేడియం స్టిక్కర్స్, మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ తో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ-వాహనాలతో పర్యావరణ పరిరక్షణ



ఐఐపీఈ డైరెక్టర్ సెంథిల్ కుమార్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్యం

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణ, పెట్రోలియం ఉత్పత్తుల ఆదా కోసం భవిష్యత్తులో ఎలక్ట్రికల్ వాహనాలనే వాడాల్సి వస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాలివాహన్ డైరెక్టర్ సెంథిల్ కుమార్ అన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం, పోకడలు, అవకాశాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ కాలుష్యరహిత సమాజం, వాతావరణంలో సమతుల్యత సాధించడం కోసం భవిష్యత్తులో అందరూ ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించడం మంచిదన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాండిచ్చేరి ప్రొఫెసర్ ఇమామ్ పాణిగ్రహి మాట్లాడుతూ వాతావరణలో కాలుష్యం వల్ల భూతాపం పెరిగిపోతోందన్నారు. వాటి నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎలక్ట్రికల్ వాహనాలు ఒకటని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదన రావు, కార్యక్రమ సమన్వయకర్తలు సుశాంత్ కుమార్ సాహు, హెచ్.వి.రమణ, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈఎస్ఎఫ్ విభాగాధిపతిగా దుర్గాప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్) విభాగాధిపతిగా విభాగం జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ నియమితులయ్యా రు. ఈ మేరకు మంగళవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. 1999లో సింటర్ ప్లాంట్ విభా గం నుంచి డిప్యూటీ మేనేజర్‌గా బదిలీపై వచ్చిన దుర్గాప్రసాద్ అంచెలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఇప్పటి వరకు హెచ్‌వోడీగా ఉన్న పి.ఎస్.ఘోష్‌ను మెకానికల్ (జీఎం)గా నియమించ డంతో ఆ స్థానంలో దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.